ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★
జిల్లా వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024

పంటలకు ఏదీ ధీమా?

- ఫసల్ బీమాకు జారీ కాని మార్గదర్శకాలు
- వానాకాలంలో ఐదు పంటలు, యాసంగిలో ఆరు పంటలకు వర్తింపు యోచన
- బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్న ఆశలు
- బీమాతో 1.2 లక్షల మంది రైతులకు లబ్ధి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రకృతి వైపరీత్యాలతో వానాకాలం, యాసంగి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతూ నష్టపోతున్న రైతులకు ధీమాను ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో మళ్లీ అమల్లోకి తెచ్చే విధంగా కొత్త ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సాగులో వివిధ పంటలు వేసుకోవడం పూర్తవుతున్న ఇప్పటి వరకు పథకం అమలుపై సందిగ్ధం వీడలేదు. ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా సాగు చేసే పంటలకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించడంపై రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా అవసరాన్ని గుర్తించి ఫసల్‌బీమా పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించినా ఈ వానాకాలం సీజన్‌లో బీమా వర్తించేనా అనే సందిగ్ధం జిల్లా రైతుల్లో ఏర్పడింది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో జిల్లాలో 2.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.83 లక్షల ఎకరాలు, పత్తి 49,210 ఎకరాలు, మొక్కజొన్న 1,510 ఎకరాలు, కందులు 1,502 ఎకరాలు, పెసర 348 ఎకరాలు, ఇతర పంటలు 599 ఎకరాలు సాగు చేసే లక్ష్యంగా పెట్టుకొని పంటలు వేసుకున్నారు. ప్రతీ పంటల సీజన్‌లో వడగండ్ల వర్షాలు, కుంభవృష్టి వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పంటల బీమా ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని భావిస్తు న్నారు. పంట చేతికి వచ్చే దశలోనే పంట నష్టపోవడం జరుగుతూ వస్తోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఫసల్‌బీమా పథకం అమలు చేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి పంటల బీమా పథకాన్ని నీరుగార్చింది. దీంతో నష్ట పోయిన రైతులకు అప్పులు మిగిలే పరిస్థితి ఏర్పడింది.

మార్గదర్శకాలకు ఎదురుచూపులు

రైతులకు ఎలాంటి భారం పడకుండా ఫసల్‌బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడానికే నిర్ణయించింది. గతంలో కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ప్రీమియం చెల్లిస్తే రైతులు తమ వాటాకింద 20 శాతం ప్రీమియం చెల్లించేవారు. ప్రస్తుతం పూర్తిగా రైతు వాటాను కూడా ప్రభుత్వమే చెల్లించి బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. ఫసల్ బీమాలో వానాకాలంలో వరి, కందులు, మొక్కజొన్న, వేరుశెనగ, జొన్న పంటలకు, యాసంగిలో వరి, పప్పుదినుసులు, మొక్కజొన్న, వేరుశెనగ, మినుములు, జొన్న పంటలకు వర్తింప జేయనున్నారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ సర్వే చేస్తున్నారు. ఈ సర్వే ప్రకారం ఫసల్ బీమాను అందిస్తారని భావిస్తున్నారు.

కౌలు రైతులకు అందేనా...

వ్యవసాయానికి సంబంధించి పట్టాదారులకు మాత్రమే రుణాలు, రైతు భరోసా, ప్రభుత్వం కల్పించే పథకాలు అందుతున్నాయి. ఫసల్ బీమా యోజన కౌలు రైతులకు వర్తింప జేస్తారా లేదా అనే అయోమయం నెలకొంది. జిల్లాలో 1.20 లక్షల మంది రైతులతో పాటు 80 వేల మంది కౌలు రైతులు కూడా ఉన్నారు. కౌలుకు ఇచ్చిన పట్టాదారులు పథకాలతో ప్రయోజనం పొందుతున్నా ప్రకృతి వైపరీత్యాల్లో మాత్రం కౌలు రైతులు నష్టపోతున్నారు. కౌలు రైతులకు కూడా ప్రయోజనం చేకూర్చాలని కోరుతున్నారు.


దెబ్బతిన్న పత్తి (ఫైల్)


ఇసుక మేటలు వేసిన వరి (ఫైల్)

'మిడ్ మానేరు'కు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 25: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, ములవాగు మానేరు వాగు ద్వారా 1050 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 314.17 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.70 టీఎంసీల మేరకు చేరుకొంది.. కాగా ఎల్ఎండీ ప్రాజెక్టుకు 6,146 క్యూసెక్కుల నీటిని విడుదలను ప్రాంభించారు.

జిల్లాలో 15.8 మిల్లీ మీటర్ల వర్షం

సిరిసిల్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాతావర ణం మబ్బులు కమ్ముకొని జల్లులు పడుతుండడంతో రైతులు, ప్రజలు ఉక్కపోతతో ఊరట పడ్డారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం కూడా వర్షపు జల్లులు పడుతు న్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం ఉదయం వరకు 15.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గంభీరావుపేటలో 24.8 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 23.1, తంగళ్లపల్లిలో 18.8, సిరిసిల్లలో 18.3, ఎల్లారెడ్డిపేటలో 18.2, ఇల్లంతకుంటలో 16.6, వేములవాడలో 15.9, చందుర్తిలో 15.6, కోనరావుపేట లో 15.1, వేములవాడ రూరల్‌లో 12.0, వీర్నపల్లిలో 10.6, బోయినపల్లిలో 10.6, అత్యల్పంగా రుద్రంగిలో 5.7 వర్షపాతం నమోదైంది. వర్షం కురుస్తుండడంతో వానాకా లం సీజన్ సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు భావిస్తున్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - మెగా జాబ్‌మేళాకు తరలివచ్చిన యువత



మెగా జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, హాజరైన యువతీ యువకులు

వేములవాడ టౌన్, ఆగస్టు 25: యువత అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. 48 కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, ఉద్యోగం చేసేది ఎక్కడ అని, వేతనాలు ఎంత అందిస్తారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఇటీవల టీచర్ల నియామకానికి మెగా డీఎస్సీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు రాత పరీక్షలు నిర్వహించామన్నారు. అలాగే గ్రూప్-4 ఉద్యోగాలకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొనసాగుతోందని, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలను కూడా పూర్తి చేసి, మెయిన్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని వివరించారు. దాదాపు ఈ ఎనిమిది నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు రాఘవేందర్, మహేష్, అన్వేష్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషిచేద్దాం

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, ఆగస్టు 25: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా కృషిచేద్దామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని, కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సావనపెల్లి రాకేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజలకు సమానత్వం సాధించడానికి అంబేద్కర్ నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు. దళిత, బహుజనులు విద్యావంతులు అయినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే నేడు పరిపాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం అట్టడుగువర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. తొలత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, ప్రొఫెసర్ ఖాసీం, కులవివక్షపోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అభినవ్, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, మాజీ ఎంపీపీ అయిలయ్య, మాజీ సర్పంచులు ముత్యం అమర్, బిగుళ్ల వనితతిరుపతి, మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి, మాజీ ప్యాక్స్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బాగుళ్ల కృష్ణ, నాయకులు తడకపెల్లి భూమయ్య, అలువాల కోటి, గుండ్రెడ్డి రాజు, పసుల వెంకటి, వినయ్‌కుమార్, మల్లిఖార్జున్, పర్శరాం, బిగుళ్ళ విజయ్, కొమురయ్య, దేవదాస్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందజేస్తాం
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 25: జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వేములవాడ శాసనసభ్యుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం ఆదివారం వేములవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా హైదరాబాద్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా అందరి సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ 65 సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఏకైక సంఘం దేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం అన్నారు. యూనియన్ చేపడుతున్న కార్యక్రమాలతో సంఘంపై రోజురోజుకు గౌరవం, నమ్మకం పెరుగుతున్నాయని, ఆనాడు 35 మందితో ప్రారంభమైన సంఘంలో నేడు 15 వేల మంది ఉన్నారని గుర్తు చేశారు. జర్నలిజానికి అసలైన పునాదులు గ్రామీణ విలేకరులేనన్నారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఐక్యంగా ఉండి పనిచేయాలని, సమాజంలోని చెడును పారద్రోలి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విలేఖరులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంబోజ ముత్యం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దాసరి దేవేందర్, గాండ్ల శ్రీనివాస్, పెద్దపల్లి, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్, రంగాచారి, రజనీకాంత్, సీనియర్ జర్నలిస్టు రేగుల దేవేందర్, జిల్లా పరిధిలోని అన్ని మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

- తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

గంభీరావుపేట ఆగస్టు 25: మండలంలోని నర్మాల మానేరు వద్ద నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ భవనం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దాదాపు తొమ్మిదేళ్లుగా అంగన్‌వాడీ భవనం నిర్మాణం కొనసాగుతోంది. అయినా అసంపూర్తిగానే మిగిలి చుట్టూ ఏపుగా పిచ్చి మొక్కలతో నూతన భవనం పాత భవనంగా మిగిలిపోతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో అంగన్‌వాడీ సెంటర్ కోసం బిఆర్‌జిఎఫ్ నిధుల నుంచి నాలుగు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. మళ్లీ తిరిగి 2018లో డీఎంఎఫ్‌టి నిధుల నుంచి మరో మూడు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఇంకా దర్వాజాలు, కిటికీలు, కరెం టు, లోపల బండ పనులు జరగాల్సి ఉంది. దీంతో అంగన్‌వాడీ సెంటర్ వినియోగంలోకి రాక నిరుపయోగంగా ఉంది. నూతన భవనం నిర్మాణం పనులు తీవ్ర జాప్యం జరుగుతుండడంతో తొలుత అద్దె భవనంలో ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ ఇంటిలో అంగన్‌వాడీ సెంటర్ కొనసాగుతోంది. అధికారులు పట్టించుకుని అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ సెంటర్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకచవితిని జరుపుకోవాలి

-డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, ఆగస్టు 25: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా భక్తిశ్రద్ధలతో వినాయక చవతి వేడుకలు జరుపుకోవాలని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మార్కండేయ ఆలయ ఆవరణలో మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లడుతూ రోడ్లకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయవద్దని అన్నారు. అలాగే డిజే సౌండ్‌లతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. శాంతియుతంగా పండగను జరుపుకోవాలని తదితర అంశాలను వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎగువ మానేరుకు శాశ్వత జలకళ

- మల్కపేట రిజర్వాయర్ నుంచి సింగసముద్రం కాలువ పనులు
- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


కాంగ్రెస్ కండువా కప్పుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 25: మల్కపేట రిజర్వాయర్ నుంచి సింగసముద్రం వరకు కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేసి ఎగువ మానేరుకు శాశ్వత జలకళను తీసుకువస్తామని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తిమ్మాపూర్, బండలింగంపల్లి గ్రామాల బీఆర్ఎస్ పార్టీకి చెంది న తాజా మాజీ సర్పంచులు రవీందర్, వాణీనర్సింలు ఆదివారం కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నారని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేటీఆర్ ఈ ప్రాంత రైతుల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. తొమ్మిదవ ప్యాకెజీ కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని అన్నారు. పనులను పూర్తి చేసేలా కలెక్టర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. రుణమాఫీ వర్తించని రైతులకు తాను ప్రత్యేక చొరవ తీసుకుని వర్తించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. నామినేటెడ్ పదవులను దశల వారీగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, దేవయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, బుచ్చాగౌడ్, బాబు, ఎల్లాగౌడ్, రమేశ్, శ్రీనివాస్, దేవేందర్, మల్లారెడ్డి, గంగయ్య, కిషన్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్టపై ఘనంగా వరదపాశం

బీర్‌పూర్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆల య సమీపంలోని పెద్దగుట్టపైన ఆదివారం వరద పాశం కార్యక్రమాన్ని అత్యం త వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగం గా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలినడకతో చేరుకొ ని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేకమైన వేద మంత్రోచ్చారణలతో ఆయా రకాల తీపి, పిండి పదార్థలతో తయారు చేసిన పాశాన్ని పెద్దగుట్టపై పోసి వర్షాలు ఎక్కువగా కురిసి వరదలు పారేలా చూడు స్వామి అంటూ మొక్కులు చెల్లించు కున్నారు. వరదపాశం నిర్వహణకు, అన్న దానం కార్యక్రమాలకు పలువురు



వరద పాశం నిర్వహిస్తున్న వేదపండితులు

దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయ సహకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్ద సంతోష్, మధుకుమార్, చిన్న సంతోష్ కుమార్, ఆయా గ్రామాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద పడి వ్యక్తి మృతి



బైక్ మీద పడి మృతి చెందిన గంగాధర్

కథలాపూర్, ఆగస్టు 25 : మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన గండి గంగాధర్ (50) అనే వ్యక్తిపై ద్విచక్రవాహనం మీదపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై నవీన్, గ్రామస్థుల కథనం ప్రకారం గంగాధర్ శుక్రవారం రాత్రి దుకాణానికి వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. గ్రామ శివారుల్లో శనివారం వెతకగా బైక్ మీదపడి మృతిచెంది ఉన్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

అంజన్న సేవలో రైల్వే ఏజీఎం



కొండగట్టులో ఏజీఎంకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 25: దక్షిణమధ్య రైల్వే ఏజీఎం ధనుంజయ్ ఆదివా రం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఏజీఎం కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆల య పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా జ్వర సర్వే

● డెంగ్యూపై వైద్యశాఖ అప్రమత్తం



ఉల్లంపల్లిలో జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

చిగురుమామిడి, ఆగస్టు 25: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో వైద్యశాఖ సిబ్బంది ఆదివారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జనవేని రోహిత్ (10) అనే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారులు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి ఆదివారం సమాచారం అందించారు. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమై ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని అన్ని వార్డులను సందర్శించారు. ఆయా వార్డుల్లో ఉన్న నీటి నిల్వలను తొలం గించారు. ఇంటింటా సర్వే చేశారు. వారి వారి ఆరోగ్య పరిస్థితులను అడి గి తెలుసుకున్నారు. కొంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఒకరికి డెంగ్యూ వచ్చిందన్న సమాచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామంలో జ్వరాల బారిన ప్రజలు

గ్రామంలో వారం రోజుల నుంచి కొంత మంది తీవ్రమైన జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ దవాఖనాలకు వెళ్లినా ఫలితం లేకుండా పోతుతందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జనవేని రోహిత్ అనే బాలునికి డెంగ్యూ వచ్చిందని జిల్లా అధికారులు అధార్ కార్డు ప్రకారం తమకు సమాచారం అందించారని ఏఎన్ఎం ధనలక్ష్మి తెలిపారు. అతను ప్రస్తుతం హుస్నాబా ద్‌లో ఉంటున్నాడని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించిన విద్యార్థులు



హైద్రాబాద్‌లోని ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు

రామడుగు, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని సరస్వతి హైస్కూల్ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆదివారం హైద్రాబాద్‌లోని ఐఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఐటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిగారి మహేష్ ఐఐటీలోని వివిధ విభాగా లను వివరించారు. ఐఐటీలో జరిగే పరిశోధనల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యూపీఎస్ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

● టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం శనివారం కేబినెట్ స మావేశంలో ప్రవేశపెట్టిన భాగస్వామ్య పెన్షన్ పథకం(సీపీఎస్) స్థానం లో, కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను అమలు చేయాలనే నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని టీఎస్‌సీపీఎస్ఇయూ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పవన్ అన్నారు. 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ప్రభుత్వం ఉద్యోగికి ఇచ్చే 50శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూపీఎస్ అంటే ఏకీకృత పెన్షన్ స్కీం కాదని, యూ స్‌లెస్ పెన్షన్ స్కీంగా భావిస్తున్నామన్నారు.

ఆయన వెంట సంఘ బాధ్యులు గంగాధరి మహేష్, సతీష్, మహేష్ గౌడ్, శ్రీనివాస్, జనార్థన్, సతీష్, శ్రీనివాస్, మహేష్, విజయ్, రాజేశం, శంకర్, రవి, రాము తదితరులున్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే పరిష్కారమార్గం

సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన పెన్షన్ విధానంను తాము అంగీకరించబోమని టీఎస్ యూటీఎఫ్ ఉపా ధ్యాయ సంఘ బాధ్యులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ స్పష్టం చేశారు. 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులకు 50శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన కుటుం బాలకు 60శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం అన్నారు. ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగుందన్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండానే సర్వీసును బట్టి 50శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	31,202	3,822	80.5	53.620
ఎల్లంపల్లి	23,091	6,719	20.175	16.967
మిడ్ మానేరు	7,350	6,146	27.54	18.70
ఎల్ఎండి	6,248	212	24.034	6.153

ప్రమాదవశాత్తు రైస్‌మిల్ కార్మికుడి మృతి

తిమ్మాపూర్, ఆగస్టు25: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల భాస్కర్ రైస్ మిల్లు ప్లాట్ ఫాం పక్కన నిద్రిస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు వ్యాన్ తగిలి మృతి చెందాడు. ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌లోని భాస్కర్ రైస్ మిల్లు లో కూలీగా పనిచేస్తున్న బీహార్‌లోని చంపారన్ జిల్లా, సిస్విపట్నంకి చెందిన కిషోర్ రాయ్(39) శనివారం అర్ధరాత్రి రైస్ మిల్లు ప్లాట్ ఫాంపై నిద్రిస్తున్నాడు. సూరజ్ అనేవ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు రివర్స్ తీసే క్రమంలో ప్లాట్‌ఫాంపై నిద్రిస్తున్న కిషోర్ రాయ్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో కిషోర్ రాయ్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి వరద

ధర్మపురి, ఆగస్టు 25: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిండిపోయిన చెరువులు, కుంటలు, వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోనికి 6,506 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు సంబంధిత 3, 1వ నెంబర్ గేట్లు ఎత్తి దిగువ గోదావరి నదిలోకి 3,981 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటల వరకు గోదావరి నది నీటి ప్రవాహం వేగంగా కొనసాగుతోంది. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎగువ వైపు ఉన్న సత్యవతి గుండం నుంచి దిగువ రాయపట్నం వైపు వరద ప్రవాహం వేగంగా కొనసాగుతోంది. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు దాటి నీటి ప్రవాహం కొనసాగుతోంది. వాగు దాటి అటు వైపు భక్తులు స్నానాలు చేసేందుకు వెళ్లకుండా వరద ప్రవాహం పెరిగింది. చిన్న గడ్డె నీటిలో మునిగిపోగా, మంచి నీటి బావి నీటిలో మునిగి పోయాయి. మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మి


ధర్మపురి వద్ద స్నానఘట్టాలు అనుకుని ప్రవహిస్తున్న గోదావరి

స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. గోదావరి నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, మగ్గిడి, జైనా, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి, తిమ్మాపూర్, బూరు గుపల్లె, రాయపట్నం గ్రామాలకు ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానకొండూర్, ఆగస్టు 25 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క లచ్చమ్మ (50)అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లచ్చమ్మ శనివారం తన పశువులకు మేత వేయడానికి గడ్డి వాము దగ్గరికి వెళ్లి దానిపై ఉన్న కవర్‌ను తీస్తుండగా విషపురుగు కాటు వేసింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ మల్లేష్, యాజమాని కమల్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

● వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి పత్రలు లేకుండా అక్రమంగా మానేరు ఇసుక తరలిస్తున్న టాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మానకొండూరు మండలం ఊటూరు గ్రామనికి చెందిన టాక్టర్ డ్రైవర్ సింగారపు వేణు ప్రసాద్, ఓనర్ సింగారపు రాజలింగంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కటిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

మంత్రాల పేరుతో మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, ఆగస్టు 25: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి శని పట్టిందని శని దోషం పోవాలంటే తమకు తొమ్మిది వేలు ఇవ్వాలని తాయత్తుల పేరిట తమను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన బాలరాజు, గంధం రాజు, పైత్యం చందులు గ్రామాల్లో తిరుగుతూ తాయత్తులు కడుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. హిమ్మత్‌నగర్‌లో శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి మీకు దోషం ఉందని శనిదోషం పోవాలంటే పూజలు చేస్తామని లేదంటే ప్రాణాలు పోతాయని బెదిరించి తన వద్ద బలవంతంగా తొమ్మిది వేలు తీసుకున్నారు. మరో ఇద్దరి దగ్గర పదకొండు వేయిలు తీసుకున్నారని ఫిర్యాదు రావడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

కొండగట్టులో పార్కింగ్ రుసుం వసూలు

● అంజన్న భక్తులకు కానున్న భారం ● అభిప్రాయాలు తెలుపాలంటున్న దేవస్థానం అధికారులు

మల్యాల, ఆగస్టు 25: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో కొండపైన వాహన పార్కింగ్ రుసుము వసూలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. దేవస్థానం కార్యాలయం ముందు గల ఖాళీ స్థలంలో ప్రస్తుతం వాహన పార్కింగ్ చేస్తున్నారు. భక్తుల రద్దీ సమయంలో వాహనాల పార్కింగ్‌కు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. భక్తులు ఇబ్బందులు పడుతుండగా పార్కింగ్ సరిగా లేకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో రహదారులపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. దేవస్థానం అధికారులు పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా తాజాగా అధికారులు పార్కింగ్‌కు రుసుము వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల భక్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వాహన పార్కింగ్‌కు సంబంధించి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో తెలుపకుండానే పార్కింగ్ రుసుము ప్రవేశపెట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆరు చక్రాల వాహనాలైన బస్సు, లారీకి రూ.50. నాలుగు చక్రాల వాహనాలు కారు, జీపు రూ.40, ఆటోకు రూ.30, ద్విచక్రవాహనాలకు రూ.10గా వాహన రుసుమును అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రుసుము ప్రవేశపెట్టడంపై దేవస్థానం అధికారులు అభిప్రాయ సేకరణకు కలెక్టరేట్ వివిధ


కొండపైన భక్తులు నిలిపిన వాహనాలు

ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీస్‌లు పెట్టారు. మెజారిటీ ప్రజలు, భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకొని దేవాదాయ కమిషనర్‌కు నివేదిస్తామని ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొండపై భక్తులకు వసతి తదితర కనీస వసతులు కల్పించకుండా ఆదాయం పెంచుకొనేందుకు పార్కింగ్ రుసుములు పెట్టడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కేశపూర్‌లో చోటు చేసుకుంది. కేశపూర్ గ్రామానికి చెందిన లక్కం రాకేష్(16) అనే యువకుడు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాకేష్ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాకేష్ కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకుండా చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడు. తండ్రి గల్ఫ్ వెళ్లి కష్టపడుతుంటే రాకేష్ చదువుకోకుండా తిరగడంతో తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి లోనై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి హుటాహుటిన మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి గంగాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కథలాపూర్, ఆగస్టు 25 : కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్న మారెల్లి భాస్కర్ (30) అనే యువకుడు శుక్రవారం క్రిమిసంహార మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... భాస్కర్ అనే యువకుడు కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. భాస్కరే స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్‌చేసి చెప్పగా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ భాస్కర్ మృతి చెందాడు. మేనమామ నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, ఆగస్టు 25 : మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(36) అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గత 20 రోజుల క్రితం కొయ్యడ కుమార్ మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్య రజితతో గొడవపడటంతో పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 ద్వారా పెద్దపల్లికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కూరగాయల విక్రయదారుడు తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామం కేసీఆర్‌నగర్‌కు చెందిన గోవింద్ సదానందం(38) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కేసీఆర్ నగర్‌కు చెందిన సదానందం గతంలో పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్న క్రమంలో అనారోగ్యానికి గురయ్యాడు. సుమారు మూడు లక్షల రూపాయల అప్పు చేసి చికిత్స చేయించారు.

అప్పటి నుంచి సిరిసిల్ల రైతు బజారులో కూరగాయలు విక్రయిస్తూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి వచ్చిన సదానందంను భార్య నిలదీయడంతో శనివారం పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ట్లు మృతుడి భార్య తెలిపింది. మృతుడికి భార్య భాగ్య, కుతురు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

● పొత్కపల్లి, బిజిగిని షరీఫ్ రైల్వే లైన్ల మధ్య మృతదేహం లభ్యం

ఓదెల, ఆగస్టు 25 : మండలంలోని పొత్కపల్లి, బిజిగిరి షరీఫ్ రైల్వే లైన్ల మధ్య ఉన్న 315/36-38 కి.మీ. స్తంభాల వద్ద ఆదివారం గుర్తు తెలియని యువకుడు (35-40ఏళ్ల) రైల్వే పట్టాల మధ్య మృతిచెంది ఉన్నాడు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాలవల్ల మృతిచెంది ఉండవచ్చని జీఆర్‌పి అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇతని ఒంటిపై పూల నలుపు రంగు చొక్కా, స్కైబ్లూ జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అలాగే మృతుని కుడి చేతిపై ఐలవ్‌యు అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. హత్యానా? లేక ఆత్మహత్య అనే విషయం జీఆర్‌పి అధికారుల విచారణ అనంతరం బయటపడే అవకాశాలు ఉన్నాయి. మంచిర్యాల రైల్వే ఎస్సై సుధాకర్ ఆదేశం మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జి.ఆర్.పి.హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్ నెం. 8712658596కు సమాచారం అందించాలని హెడ్‌కానిస్టేబుల్ కోరారు.

బీసీ కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

● 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి ● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మండ్లు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవనంలో బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్శ హన్మండ్లు మాట్లాడారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీ కుల గణను చేసి, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ కమీషన్ చేసిన సిఫారస్, కృషితోనే విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు రిజర్వేషన్లు వచ్చాయని అన్నారు. జనాభ ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లను 27 శాతం నుండి 60 శాతంకు పెంచాల్సి ఉండగా పాలకులు 18 శాతంకు తగ్గించారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లేరేషన్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. బీసీ కుల గణన చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ప్రకటిస్తే మరోపక్క ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుందన్నారు. బీసీ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు


కేక్‌కట్ చేస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మండ్లు

పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు అందినప్పుడే బీపీ మండల్‌కు అసలైన నివాళి దక్కుతుందన్నారు. బీపీ మండల్ స్ఫూర్తితో పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేష్‌యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడుక కమలాకర్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, నాయకులు కందుకూరి రామాగౌడ్, ప్రసాద్, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్, రాజు, కైలాష్, గణేష్ పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

● తప్పిన ప్రమాదం


తాటిపల్లి- చల్‌గల్ శివారులో అదుపుతప్పి బోల్తాపడిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 25: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్-తాటిపల్లి శివారులో జగిత్యాల నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం కారు అదుపు తప్పి బోల్తాపడింది. నిజామాబాద్ జిల్లా మోతె గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు జగిత్యాల మీదుగా మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో చల్‌గల్-తాటిపల్లి శివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో కారు పడి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

వాలీబాల్ జాతీయ క్రీడాకారులను గౌరవించుకోవాలి

● ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుకిషన్‌రావు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జాతీయ వాలీబాల్ క్రీడాకారులను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించుకొని గౌరవించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి సిహెచ్ వేణుకిషన్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియం ఆవరణలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి చింతకింది శ్యాంకుమార్ అధ్యక్షతన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. 2020 నుంచి 2024 వరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లపై సహాయ కార్యదర్శి శ్యాంకుమార్ నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎన్నికల అధికారి వేణుకిషన్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. సభ్యులు జిల్లా అసోసియేషన్ కార్యవర్గంను ఏకగ్రీవరంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షులుగా డి లక్ష్మీనారాయణ, వై ప్రసాద్‌రావు, చింతకింది శ్యాంకుమార్, యెల్లండి వేణు, జీ మహేష్, ఎండీ రఫీ, కోల శ్రీనివాస్, జె వెంకటేశ్వర్‌రావు, సంఘ స్వామి, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా రాందాస్, కోశాధికారిగా కోడం



మాట్లాడుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేణుకిషన్‌రావు


సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా పీ రాంచంద్రంగౌడ్, సాన బాబు, సిహెచ్ రాజశేఖర్, మాదాసు లక్ష్మణ్, షేక్ గౌస్, జె అజిత్‌రావు, బాపురెడ్డి, బోయిని రవి, ఏ మాధవరెడ్డి, ఎస్ కార్తిక్, కార్యవర్గ సభ్యులుగా అనిల్ గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్, బాలేష్, దేవయ్య, వేణు, లతీఫ్, స్వామి, అజీమ్, రామస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేణుకిషన్ మాట్లాడుతూ వాలీబాల్ అసోసియేషన్ ఒక కుటుంబంలా కలసి కట్టుగా వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేయాలన్నారు. 15 సంవత్సరాల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఎంపిక కావడంలో ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. అనంతరం నూతన కార్యవర్గంను ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు సన్మానించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు, ఎన్నికల అధికారి, అబ్జర్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికల అబ్జర్వర్ ఎన్ శ్రీధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, దేవత ప్రభాకర్, గుడ్ల రవి, కోచ్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కొడిమ్యాల, ఆగస్టు 25: మండలంలోని నల్లగొండ గ్రామంలోని తన మనుమరాలి ఇంట్లో నివాసం ఉంటున్న కాసర్ల లస్మవ్వ(75)ఆదివారం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లి మండలం గుట్టలపల్లికి గ్రామానికి చెందిన కాసర్ల లస్మవ్వ, ఆమె మనుమడు కాసర్ల సురేష్ నల్లగొండలోని లెంకల యమున ఇంట్లో నివసిస్తున్నారు. యమున సోదరుడు సురేష్‌ను ఏదో ఒక పని చేసుకోవాలని, ఖాళీగా ఉండకూడదని అనటంతో ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకొని యమున నానమ్మ అయిన లస్మవ్వను మనుమడు సురేష్ కర్రతో కొట్టాడు. దీంతో వృద్ధురాలి చేతికి, తలకు గాయాలయ్యాయి. వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతురాలి మనుమరాలు యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యమ ధర్మరాజు ఆలయంలో భరణి నక్షత్ర పూజలు

ధర్మపురి, ఆగస్టు 25: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో ఆదివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు. భరణి నక్షత్రం పురస్కరించుకుని యమధర్మరాజు ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన అభిషేకం, ఆయుష్య హోమం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకున్నారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

● ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం భక్తుడు సమర్పించిన రెండు 400 లీటర్ల కెపాసిటీ గల వాటర్ కూలర్స్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్


యమ ధర్మరాజు ఆలయంలో పూజలు

కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

మత్స్యకార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్

సుభాష్‌నగర్, ఆగస్టు 25: ముదిరాజ్‌లను బీసీ-డి నుంచి బీసీ-ఏలో చేర్చాలని కరీంనగర్ జిల్లా మత్స్య కార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్య క్షుడు ఉస్తేం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్య కార్మికులకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మత్స్య కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మికులకు సొసైటీల ద్వారా ఒక్కొక్కరికి రూ.25లక్షల గ్రూపు ఇన్సూరెన్సు ప్రకటించాలని, మత్స్య కార్మికల పిల్లలకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్య కార్మికులకు ఎలాంటి శిస్తు లేకుండా సొసైటీని ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్య కార్మికులకు నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భూమా సంపత్, ప్రధాన కార్యదర్శి నెల్లి శంకర్, ఉపాధ్యక్షులు పెసరి శ్రీనివాస్, గుడెల్ల మల్లేశ్, కుంచం శ్రీనివాస్, చొక్క లక్ష్మయ్య, పిల్లి స్వామి, కరీంనగర్ పట్టణ అధ్యక్షురాలు తునికి వనజ పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 25: రాష్ట్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం కోసం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేసి, కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో బడా వ్యాపారులు, సినీ పరిశ్రమకు సంబంధించినవారు, బీఆర్ఎస్ నాయకులు విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచి పెటాలని కోరారు. హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లో కూడా హైడ్రా లాంటిది ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

ఆస్తి పంపకాల కోసం అంత్యక్రియలు ఆలస్యం

గంగాధర, ఆగస్టు 25: ఆస్తి కేటాయింపుల కారణంగా గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన నరేందర్‌రెడ్డి(26) మృతదేహానికి దహన సంస్కారాలు రెండు రోజులు ఆలస్యంగా నిర్వహించారు. నరేందర్‌రెడ్డి ఈ నెల 2న కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్ తర లించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి శనివారం మృతిచెం దాడు. మృతుడి 8నెలల కూతురు, భార్యకు ఆధారం చూపాలని వారి బంధువులు పట్టుబట్టారు. పంచాయతీ ఎటూ తేలకపోవడంతో శనివారం పోస్టుమార్టంకు తీసుకెళ్లిన నరేందర్‌రెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫ్రీజర్‌లో పెట్టారు. ఇరు కుటుంబ సభ్యుల ఒప్పందం కుదరగా ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి ఆచంపల్లిలో దహన సంస్కారాలు నిర్వహించారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- వేములవాడకు భారీగా తరలివచ్చిన భక్తులు - కోడెమొక్కులకు మూడు గంటల సమయం


భక్తులతో రద్దీగా మారిన ఆలయ ప్రాంగణం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. శ్రావణ మాసం, ఆదివారం కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆదివారం తెల్లవారుజామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకునేందు కు కోడె మొక్కుల క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు.

సుమారుగా మూడు గంటలపాటు కోడెమొక్కు కోసం భక్తులు క్యూలైన్‌లో నిరీక్షించడంతో పాటుగా 10.15 గంటలకు బ్రేక్ దర్శనం అమలు చేయడంతో కోడెమొక్కు క్యూలైన్‌లోని భక్తులు మరో గంటపాటు వేచి ఉన్నారు.

● మొరాయించిన బ్రేక్ దర్శనం టికెట్ సిస్టం..

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం 10.15 గంటల నుంచి 11.15 గంటల వరకు బ్రేక్‌దర్శనం అమలు చేశారు. దీంతో 10 గంటలకు బ్రేక్‌దర్శనం క్యూలైన్ వద్ద భక్తులు బారులు తీరారు. టికెట్ ఇచ్చేందుకు వచ్చిన ఉద్యోగి రాజు కంప్యూటర్ ఓపెన్ చేయడంతో సిస్టం మొరాయించి పని చేయలేదు. దీంతో చేసేదేమీ లేక సదరు ఉద్యోగి వెంటనే మ్యానువల్ టికెట్‌లను భక్తులకు అందించాడు.

బ్రేక్‌దర్శనం టికెట్‌తో పాటుగా భక్తులకు ఒక టికెట్‌పై ఒక లడ్డును ఇవ్వాల్సి వుంటుంది. అయితే టికెట్ ఇవ్వడం, లడ్డును ప్యాక్ చేసి ఇవ్వడం ఒకరే చేయడంతో బ్రేక్‌దర్శనం టికెట్ ఇవ్వడంలో జాప్యం జరిగింది. భక్తులు ఆలయ ఉద్యోగుల తీరుపై మండిపడ్డారు.

● శీఘ్రదర్శనం టికెట్లు తీసుకున్న భక్తుల ఆగ్రహం..

శీఘ్రదర్శనం టికెట్లను ఒక వ్యక్తి క్యూలైన్‌ల వద్ద తమకు విక్రయించాడని ఆ టికెట్‌లు చెల్లవని క్యూలైన్‌లో పంపడం లేదని పలువురు భక్తులు పీఆర్వో కార్యాలయానికి తరలివచ్చారు. తాము టికెట్‌లు తీసుకున్నా క్యూలైన్‌లో అనుమతించలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది వెంటనే సదరు భక్తులను తీసుకుని వెళ్లి బ్రేక్‌దర్శనం క్యూలైన్ తాళం తీసి అందులో నుంచి భక్తులను అనుమతించారు.

అభివృద్ధికి దూరంగా విలీన గ్రామాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


సమావేశంలో మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సిరిసిల్ల మున్సిపల్‌లో ఏడు గ్రామాలను విలీనం చేయడం ద్వారా అభివృద్ధికి నోచుకోలేక పోయాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు గ్రామాలను సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేయడం వల్ల గ్రామాల్లోని ప్రజలకు ఉపాధి హామీ దూరమైందన్నారు. విలీన గ్రామ ప్రజలపై మున్సిపల్ అధిక పన్నులను విధిస్తూ బలవంతంగా వసూలు చేయడంతో భయాందోళనలకు గురి అవుతున్నారని అన్నారు. విలీన గ్రామాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విలీన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చాలంటూ నిర్వహిస్తున్న పోరాటాలకు సీపీఐ సంపూర్ణ మద్దతును ఇస్తుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి కొన్ని హామీలనిచ్చారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడు విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా మారుస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. విలీన గ్రామాల్లో డ్రైనేజీ, రోడ్లు, వైకుంఠధామాల నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. మున్సిపల్‌లో విలీనమైన గ్రామాలను వెంటనే గ్రామ పంచాయతీలుగా మార్చి గ్రామాల అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు మీసం లక్ష్మణ్, అజ్జ వేణు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 25: మండలంలోని కిష్టరావుపల్లె గ్రామపంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ ఆత్మహత్యా యత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ, ఎంపీఓలకు మాజీ ప్రజాప్రతినిధులకు సైతం గౌరవం ఇవ్వడం లేదన్నారు. పంచాయితీ కార్యదర్శులపై ఇష్టానుసారంగా మాట్లాడం వారికి అలవాటుగా మారిందన్నారు. ప్రజలకు సేవలు అందించవలసిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తు ఊరుకోమన్నారు. ఉన్నతస్థాయి అధికారులు సంఘటనపై విచారణ జరుపాలని కోరారు..

బీసీ వర్గాల సమస్యలపై పోరాటాలు చేయాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25: జిల్లాలో బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి మహారాజుల మురళి కోరారు. సిరిసిల్లలో ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి మహారాజుల మరళి ఓబీసీ నాయకులతో పార్టీకి సంబంధించిన సమస్యలతోపాటు చేపట్టాల్సి కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా పార్టీ పిలుపు మేరకు బీసీ వర్గానికి చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కువ దృష్టి సారించి వాటిపై పోరాటాలు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్, రాష్ట్ర కమిటిసభ్యులు కంచర్ల పర్శరాములు, దాసరి శ్రీనివాస్, యువమోర్చా నాయకులు అనూష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, చిలుక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

వీర్నపల్లి, ఆగస్టు 25: కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు కార్మికులకు అందని ద్రాక్షలాగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వం కార్మికుల వెల్ఫేర్ బోర్డు సంక్షేమాలను ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు టెండర్‌ను పిలవడం కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. ప్రైవేట్ పరం చేసే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న ప్రభుత్వం ప్రైవే ట్ ఏజెన్సీలతో చర్చలను వ్యతిరేకంగా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. సీఐటీయూ నాయకులు గుం టుకు నరేందర్, నాయకులు దేవయ్య, బూస రాజం, గంగిపల్లి అంజయ్య, రాజు, నర్సయ్య, శంకర్, చంద్రయ్య, రాజయ్య, చిన్నరాజం, పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

20 ఫీట్లకు చేరిన ఎగువ మానేరు నీటిమట్టం


నిండుకుండలా ఎగువ మానేరు ప్రాజెక్ట్

గంభీరావుపేట ఆగస్టు 25: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు నీటిమట్టం 20 ఫీట్లకు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు అటు కూడెల్లి ఇటు పాల్వంచ వాగులు ప్రవహిస్తున్నాయి. ఎగువ మానేరు ప్రాజెక్టుకు జీవనాధారమైన వాగులు ప్రవహిస్తుండడంతో క్రమంగా మానేరు జలాశయం నీటిమట్టం పెరుగుతుంది. పాల్వంచ, కూడవెల్లి వాగుల నుండి వరదనీరు వస్తుండడంతో మానేరు నీటిమట్టం ఆదివారం నాటికి 20 ఫీట్లకు చేరింది. వరద ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే మానేరు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 31 అడుగుల సామర్థ్యం ఉన్న మానేరు లో ప్రస్తుతం 20 ఫీట్ల నీరు చేరింది.

రాజన్న ఆలయంలో నైవేద్యంపై నిర్లక్ష్యం..

- ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజరాజేశ్వరస్వామి వారికి నిత్యం 11.30 గంటలకు నివేదన సమయంలో నైవేద్యం సమర్పించాల్సి ఉంటుంది. వంట చేయాల్సిన బ్రాహ్మణ వంట మనిషి ఈ నెల 23న తప్పతాగి విధులకు హాజరయ్యాడు. స్వామి వారికి ఉడకని అన్నంతో అరగంట ఆలస్యంగా నైవేద్యం సమర్పించిన ఘటనలో విచారణ జరిపి సదరు ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. రాజన్న ఆలయంలో గైడ్‌గా పనిచేసే వ్యక్తిని, సేవాదారుగా విధులు నిర్వర్తించే కాంట్రాక్టు ఉద్యోగిని అవినీతి ఆరోపణలు రావడంతో విధుల నుంచి ఈవో సస్పెండ్ చేశారు.

యూపీఎస్ విధానం సరైంది కాదు

- పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారం - టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25: సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్) పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ విధానం సరైంది కాదని పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ పేరిట పెన్షన్ విధానాన్ని మాసిబూసి మారేడు కాయ చేయడమేనని అన్నారు. 25 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగ కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించారన్నారు. చందాలతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోగా ఐచ్ఛికమని పేర్కొనడంలోనే మోసం ఉందన్నారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీస్‌ను బట్టి 50 శాతం పెన్షన్‌ను ఇచ్చే పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ పథకంతో పోల్చుకుంటే ఈ యూపీఎస్‌లో ఉద్యోగ కంట్రిబ్యూషన్ అదనంగా ఉందని అన్నారు. ఉద్యోగి సొమ్ము షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల భద్రత లేదని పెన్షన్‌పై పీఆర్సీ అమలు లేకపోవడంతో భవిష్యత్తులో ఉద్యోగికి వచ్చే పెన్షన్‌లో పెరుగుదల ఉండదని అన్నారు. రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శంకర్‌గౌడ్ కోరారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు గోల్కొండ శ్రీధర్, గుండమనేని మహేందర్‌రావు, అంబటి రమేష్, పరకాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 23,091 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.967 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

ఆదివరాహ స్వామి క్షేత్రంలో భక్తుల సందడి

కమాన్‌పూర్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రావణమాసంలో స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా భక్తులు వచ్చారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

భగత్‌నగర్, ఆగస్టు 25: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జోన్ ఇన్‌చార్జి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజా విశ్వాసం కోల్పోయాయని ఆయన అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి బీఆర్‌ఎస్ బంగారు తెలంగాణ, నేటి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రజల్లో అట్టర్ ప్లాప్ అయ్యాయన్నారు. దేశం కోసం పనిచేసే ఏకైకపార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. ప్రపం చంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీకి గుర్తింపు ఉందన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృంగా చేపట్టా లన్నారు. సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలో పేతం అయ్యందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు కోసం కృషి చేయా లన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా మని ప్రజలను రైతుల ను మోసం చేసిందన్నారు. రేకుర్తిలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ డి శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాడ వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కొరటాల శివ రామయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీరాధాకృష్ణులకు క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, శ్రీకృష్ణుడికి ఊయల సేవ..

సిరిసిల్ల రూరల్, అగస్టు 25: ఇస్కాన్ సేవాసమితి అధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ఆదివారం అత్యంత వైభోపేతంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ప్రాణనాథ అచ్యుత దాస అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన శ్రీకృష్ణజన్మాష్టమి కార్యక్రమాల్లో భాగంగా దేవతామూర్తులైన రాధాకృష్ణులకు మహాభిషేకంల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి పాల్గొని క్షీరాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇస్కాన్ సేవా సమితి అధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 9గంటలకు దర్శన హారతి, గురుపూజ, ప్రతి ఒక్కరికి దర్శనం హరినామ జపయజ్ఞం, అన్నదాన సేవ, రాజభోగ సమర్పణ, ధూప హారతి, మహా అభిషేకం, మహామంగళహారతి, మహా సంకీర్తనం కార్యక్రమాలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సిరిసిల్లలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం అధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించడంతో హర్షదాయకమన్నారు. ప్రపంచాన్ని సరైన మార్గంలో నడిపించడానికి కృష్ణభగవానుడు భగవద్గీత రూపంలో ఈ ప్రపంచానికి బోధించిన బోధనలు ఆదర్శప్రాయమైన మానవ జీవనానికి ప్రపంచ శాంతికి మార్గాలన్నారు. ఎన్ని తరాలు మారినా శ్రీకృష్ణ భగవానుడు బోధించిన భగవద్గీత మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమాంలో కౌన్సిలర్ దార్నం అరుణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అడెపు శ్రీహరి, కోడం అశోక్, గాజుల రవి, సిరిసిల్ల తిరుపతిలు పాల్గొన్నారు.

పద్మశాలి సమాజ అభివృద్ధికి కృషి

- పోపా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు సత్యనారాయణ


పోలు సత్యనారాయణను సన్మానిస్తున్న పోపా సభ్యులు

సిరిసిల్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సమాజ అభివృద్ధికి కృషి చేస్తామని, సమాజాన్ని ముందుకు తీసుకెళ్తామని పద్మశాలీ అఫీసీయల్స్ అండ్ ప్రొఫెషనల్స్(పోపా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని పద్మశాలీ కల్యాణ భవన్‌లో పోపా సమావేశం నిర్వహించారు. వచ్చే మార్చిలో జరిగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలు సత్యనారాయణకు పూర్తిగా మద్దతు ఉంటుందని జిల్లాలోని ఉపాధ్యాయులు తీర్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పోపా ద్వారా జరుగుతున్న అనేక కార్యాక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. ఇటీవల నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భగా సత్యనారాయణ పోపా జిల్లా కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో పోపా సిరిసిల్ల కార్యదర్శి పున్నం చందర్, ఎంఈవో రఘుపతి, మురళి, భూపతి, కృష్ణహరి, రవీందర్, శ్రీరాములు, మల్లికార్జున్, శ్రీనివాస్, గోవర్దన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో పోపా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోపా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గంలో చర్చించి పలు అంశాలను తీర్మానం చేయగా ముఖ్యంగా పోపా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాల్లో తిరుగుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేశారని, రాబోవు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలు సత్యనారాయణ పోటీ చేయాల్సిందిగా ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రజనీకాంత్, సదానందం, శ్రీధర్, మల్లికార్జున్, విఠల్, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

శిథిల తరగతి గదుల కూల్చివేత

మల్యాల, ఆగస్టు 25: మండలంలోని తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల శిథిల తరగతి గదులను ఆదివారం అధికారులు కూల్చివేయించారు.

ఈ నెల 1న 'ఆంధ్ర జ్యోతి'లో శిథిల భవనం.. విద్యార్థులకు సంకటం శీర్షికన ప్రచురితం అయిన కథనంతో కలెక్టర్ సంబంధిత వి ద్యాశాఖ అధికారులకు, ఎంపీడీవోకు కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక నాయకుల సహకారంతో ఆ భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

రోడ్డును మరమ్మతు చేసిన యువకులు

కొడిమ్యాల, ఆగస్టు 25: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కోనాపూర్ గ్రామంలోకి వెల్లె ముందున్న లో లేవెల్ కల్వర్ట్ వాగు నీటి ప్రవాహంతో గుంతలమయంగా మారింది. దీంతో గ్రామస్తులకు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచు దూమాల నర్సయ్య మరి కొంతమంది యువకులు చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యంకు రోడ్డు మరమ్మత్తు విషయం తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదివారం రోడ్డు మరమ్మత్తు పనులను చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల శ్రవణ్, పులి అంజయ్య, విజయ్, తిరుపతి, దుర్గయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న మసీదు చెరువు


మత్తడి దూకుతన్న మసీదు చెరువు

గంభీరావుపేట ఆగస్టు 25: మండలంలోని ముస్తఫానగర్ గ్రామ సమీపంలో ఉన్న మసీదు చెరువు మత్తడి దూకుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు వస్తుండడంతో వరద నీరు చింతల్ చెరువు ద్వారా మసీదు చెరువులోకి వస్తున్నాయి. దీంతో మసీదు చెరువు ఆదివారం మత్తడి దూకుతుండడంతో అయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మసీద్ చెరువు మత్తడి దూకుతుండడంతో బోధర్ కాలువ ద్వారా నమాజ్ చెరువులోకి వరద నీరు వస్తోంది.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 25: రాష్ట్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం కోసం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేసి, కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో బడా వ్యాపారులు, సినీ పరిశ్రమకు సంబంధిం చినవారు, బీఆర్‌ఎస్ నాయకులు విలువైన ప్రభుత్వ భూము లను కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచి పెట్టాలని కోరారు. హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లో కూడా హైడ్రా లాంటిది ఏర్పాటు చేయాలని కోరారు.